క్లుప్తంగా

కారణజన్ముడు రతన్ టాటా



రతన్‌టాటా చిత్రపటం ముందు నివాళులు అర్పిస్తున్న అన్నాదొరై, కిరణ్ తదితరులు

నారాయణవనం: భారతదేశ సాంకేతిక, పారిశ్రామిక, సేవా రంగాలలో విశేష సేవలను అందించిన రతన్‌టాటా కారణజన్ముడని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నాదొరై, రాకేష్ కిరణ్ కీర్తించారు. గురువారం సాయంత్రం నారాయణవనంలో రతన్‌టాటా చిత్రపటానికి పార్టీ నాయకులతో కలిసి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. మండల ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు అశోక్, ఎంపీటీసీ రవి, మాజీ సర్పంచ్ పీజీ బాబు, నాయకులు మంజునాథ్, గోవిందస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సత్యవేడు: సత్యవేడు, దాసుకుప్పం సబ్ స్టేషన్ల పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు సబ్ ఇంజినీర్ రాజ్ కిరణ్ తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు, విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనుల దృష్ట్యా విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పనితీరు మార్చుకోకపోతే చర్యలు

బుచ్చినాయుడుకండ్రిగ: గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సచివాలయ సర్వేయర్లు పనితీరు బాగోలేదని, వారు పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని తహసీల్దార్ సుబ్రమణ్యం హెచ్చరించారు. గురువారం ఆయన తన కార్యాలయంలో వీఆర్‌ఓలు, సర్వేయర్లు, సిబ్బందికి సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రీవెన్స్ డే రోజున నిర్వహించే ప్రజా సమస్యల ప్రజావేదిక కార్యక్రమంలో వచ్చిన వినతులపై విచారణ చేసి త్వరితగతిన పరిష్కరించాలని, అలాగే భూ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను తన దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబునాయుడు, మండల సర్వేయరు రాజ్‌కుమార్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించరూ!

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని సీపీఐ నాయకులు ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డిని కోరారు. ఆదివారం వారు నూతన ఆర్డీఓను మర్యాదపూర్వకంగా కలిశారు. వారు మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పలు రెవెన్యూ సమస్యలు ఉన్నాయని, ప్రధానంగా దళిత, గిరిజనుల భూ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ నాయకులు జనమాల గురవయ్య, మించల శివకుమార్, గోపి పాల్గొన్నారు.

పిచ్చాటూరు ఎంపీడీఓగా మహ్మద్ రఫీ



మహ్మద్ రఫీ

నాగలాపురం: పిచ్చాటూరు ఎంపీడీఓగా మహ్మద్‌రఫీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న రాధారాణిని కేవీబీపురం మండలానికి బదిలీ చేశారు. ఆమె స్థానంలోకి వి.కోట మండలం నుంచి బదిలీపై రఫీ వచ్చారు.

వస్త్రాలను నేయడంలో తమ సృజనాత్మక నైపుణ్యంతో రాజులను సైతం మెప్పించి శభాష్ అని ప్రశంసలు, బహుమతులు పొందిన ఘన చరిత్ర నేత కార్మికులది. కాల పరిభ్రమణంలో ఈ వైభవం అంతా ఒకప్పటి జ్ఞాపకంగా మిగిలిపోతోంది. ప్రస్తుతం కార్మికులు పూట గడవని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. రోజంతా కుటుంబం యావత్తూ శ్రమించినా మూడు వందల కూలీ కూడా గిట్టకపోవడంతో ఈ పరిస్థితి ఉత్పన్నమైంది. ఫలితంగా వృత్తిక స్వస్తి పలికి కుటుంబ పోషణ నిమిత్తం ఇతర పనులకు వెళ్లేందుకు సిద్ధం అవుతుండడంతో చేనేత పరిశ్రమ కుంటుపడుతోంది.



రాట్నంలో పడుగు తోడుతున్న నేత మహిళ

లుంగీ కార్మికుల బతుకు దుర్భరం

- గిట్టుబాటు కాని కూలీ
- వృత్తికి దూరమవుతున్న నేత కార్మికులు
- ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపు
- నేతన్నలకు ఉచిత విద్యుత్ హామీ నెరవేర్చని ప్రభుత్వం

సత్యవేడు: మండలంలో రెండు దశాబ్దాల క్రితం దాదాపు 2000 కుటుంబాలకు పైగా నేత కార్మికులు ఉండేవారు. క్రమం క్రమంగా వృత్తి పనులు గిట్టుబాటుకాక ఇతరత్రా వాటికి మరలడంతో ప్రస్తుతం 500 కుటుంబాలకు లోపే నేత కార్మికులు ఉంటున్నారు.

లుంగీలకు గిరాకీ

మార్కెట్‌లో నేత కార్మికులు తయారుచేస్తున్న శంఖు మార్కు లుంగీలకు మంచి డిమాండ్ ఉంది. కానీ ఆ లుంగీలు తయారు చేస్తున్న నేత కార్మికులకు మాత్రం స్వల్పంగా కూలీ దక్కుతోంది. రేయింబవళ్లు రెక్కాడినా డొక్క నిండక బతుకులు ఇబ్బందుల నడుమ సాగిస్తున్నారు.

మదనంబేడు లుంగీల నేత కార్మికులు

మదనంబేడు పంచాయతీ కేఎస్‌పేటలో శంఖు మార్కు, కిబ్స్ మార్కు లుంగీలు నేస్తున్న కార్మికుల కుటుంబాలు 25 వరకూ ఉన్నాయి. గతంలో ఒక్క మదనంబేడులోనే 200 కుటుంబాలకు పైగా లుంగీలు తయారు చేసేవారు. లుంగీ తయారీ నేతకు కావాల్సిన ముడిసరుకులైన పడుగు, పేక, ముసుపు తక్కువ ధరలో మార్కెట్‌లో లభించేవి. అప్పుడు సొంతంగా కార్మికులు లుంగీలు తయారు చేసిన వ్యాపారులకు విక్రయించి ఆదాయం కళ్లజూసేవారు. ప్రస్తుతం పడుగు, పేక ధరలు ఆకాశాన్ని తాకుతుండడంతో కార్మికులు సొంతంగా వీటిని కొనలేక మాస్టర్ వీవర్స్, పెద్ద పెద్ద కంపెనీలు యజమానులు తక్కువగా ఇచ్చే కూలీతో ఇప్పుడు లుంగీలు నేస్తున్నారు. కుటుంబంలో దంపతులిద్దరూ పనిచేస్తేగానీ నేత పని జరగదు. రోజంతా కుటుంబీకులు కలసి పనిచేసినా రూ. 400 కూడా గిట్టడం లేదు. ఈ నేపథ్యంలో నేత కార్మికులు కుటుంబ భారం మోయలేక ఇతర వృత్తులు, పనుల వైపు మరలుతుండడంతో నేత కార్మికుల సంఖ్య పడిపోతోంది.



మగ్గంలో లుంగీని నేస్తున్న నేత కార్మికుడు

మార్కెట్‌లో గిరాకీ ఉన్నా కూలీలేదు

వాస్తవానికి చెన్నై మార్కెట్‌లో శంఖు, కిబ్స్ మార్కుల లుంగీలకు మంచి గిరాకీ ఉంది. వ్యాపారులు మాత్రం లాభాలు గడిస్తున్నారు. అయితే నేత కార్మికులకు మాత్రం కూలీ లేదు. పవర్ లూమ్స్‌లో ఎన్ని లుంగీలు తయారైనా ఇప్పటికీ చేనేత లుంగీలకు డిమాండ్ ఉంటోంది.

నేత పనిలో కుటుంబం

ఒక వస్త్రం లేదా ఒక లుంగీ తయారు చేసేందుకు మొదట మహిళలు పేక నూలును రాట్నంతో వడికి పడుగుగా తయారు చేస్తారు. వాటిని మహిళే అచ్చులో అతికిస్తారు. మగవారు అల్లు పట్టి నేతకు ఉపయోగిస్తారు. మగ్గంపై నేతకు అవసరమైన నూలును, కండీలుగా వృద్ధులు, లేక పిల్లలు చుట్టిస్తారు. 16 మీటర్ల నేత పనిలో 8లుంగీలు తయారు చేస్తారు. ఇలా ఇంటిల్లిపాదీ పనిచేస్తారు. రోజుకు రెండు లేదా మూడు లుంగీలు నేస్తారు.

పని ఉన్నా కూలీలేదు



“ లుంగీలు ఎన్నైనా తయారు చేయమని యజమానులు ఆర్డర్లు ఇస్తున్నారు. అయితే 8లుంగీలు నేస్తే రూ.7 వందలు ఇస్తున్నారు. వారానికి 16 లుంగీలు నేస్తే రూ.14వందలు వస్తోంది. రోజుకు రెండు వందలు కూలీ పడుతోంది.కష్టంగా ఉంది.

– బి. సుబ్రమణ్యం, మదనంబేడు.

నిత్యావసర సరుకులు కొనలేకున్నాం



కూరగాయలు, పప్పుదినుసులు, నూనెధరలు కూడా చుక్కలనంటాయి. నేత పనితో వారికి వచ్చే డబ్బు కూరగాయలు, పప్పుదినుసులకే చాలడం లేదు. కరెంటు బిల్లు కట్టలేని పరిస్థితిలో ఉన్నాం. వారంలో ఎక్కువ రోజులు ఊరగాయతో అన్నం తింటున్నాం.

– మల్లీశ్వరమ్మ, మదనంబేడు

వడ్డీ రహిత రుణాలు ఇవ్వాలి



ప్రభుత్వం నేత కార్మికులకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలి. చేనేత కార్మికుల ఇంటికి ఉచిత విద్యుత్ ఇస్తే ఎంతో మేలు. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో పడుగు పేక చెమ్మ గిల్లి పనులు జరగడం లేదు. పని లేకపోవడంతో అప్పులు చేయాల్సిన పరిస్థితి. నేత కార్మికులను ప్రభుత్వమే ఆదుకోవాలి.

– ఏ.తిరుపతి, మదనంబేడు.

అ‘పూర్వ’ సమ్మేళనం

శ్రీకాళహస్తి రూరల్: టీచర్ ట్రైనింగ్ కోర్సు పూర్తి చేసి ఎక్కడెక్కడో స్థిరపడిన ఛాత్రోపాధ్యాయులు దశాబ్ద కాలం తర్వాత కలిశారు. జ్ఞాపకాలతో సందడి చేశారు. తమ గురుదేవులను సత్కరించారు. శ్రీకాళహస్తి మండలం కాపుగున్నేరు శ్రీకాళహస్తీశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ కళాశాలలో 2012–14లో డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (టీచర్ ట్రైనింగ్ కోర్స్) పూర్తి చేసిన వారు తాము చదివిన విద్యాసంస్థలో గురువారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. స్కిమ్స్ కరస్పాండెంట్ మిద్దెల హరి మాట్లాడుతూ, పదేళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు మళ్లీ ఇక్కడ కలవడం, అప్పటి బ్యాచ్‌లోని విద్యార్థులలో చాలామంది ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉండటం ఆనందంగా ఉందన్నారు. గుణాత్మకమైన విద్యతో పాటు క్రమశిక్షణ, విలువలతో కూడిన వారి తమను గురుదేవులు తీర్చిదిద్దడం వల్లే జీవితంలో స్థిరపడ్డామని పూర్వ విద్యార్థులు చెప్పారు. అనంతరం పూర్వ విద్యార్థులకు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అంజూరు కుమార్, మాజీ అధ్యాపకులు సత్యనారాయణరావు, అన్వర్‌ఖాన్ బహమని, చంద్రశేఖర్, స్కిమ్స్ ప్రిన్సిపల్ గీతాదేవి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



కరస్పాండెంట్, పూర్వ ప్రిన్సిపల్, అధ్యాపకులను సన్మానించిన పూర్వ విద్యార్థులు

ముళ్లపొదల తొలగింపు



ముళ్లపొదలను తొలగించడంతో శుభ్రంగా కనిపిస్తున్న ఆర్‌బీకే ముందరి ప్రదేశం

సాక్షి ఎఫెక్ట్..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నీర్పాకోట రైతు సేవా కేంద్రం ఆవరణ ముందు ఉన్న ముళ్లపొదలను గురువారం మండల వ్యవసాయాధికారిణి భారతి కూలీలతో తొలగించారు. గత శనివారం సాక్షి దినపత్రికలో ‘ముళ్లపొదలు తొలగించండి’ శీర్షికతో ప్రచురించిన కథనంపై ఏఓ స్పందించారు. ఆర్‌బీకే ముందు ముళ్లపొదలుండటంతో రైతులు ఎరువులను తీసుకెళ్లడానికి తీవ్ర ఇబ్బంది పడేవారు. వీటిని తొలగించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ఇది కూటమి నేతల పైశాచిక ఆనందమే

- కేవీబీపురంలో శిలాఫలకం ధ్వంసంపై నూకతోటి రాజేష్ ఖండన
- నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్

వరదయ్యపాళెం: ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసి కూటమి నేతలు పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారని సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవీబీపురం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆధునీకరణ పనులకు సంబంధించి గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని బుధవారం రాత్రి టీడీపీ మద్దతుదారులైన ఒళ్లూరు సర్పంచ్ అనుచరులు ధ్వంసం చేయడం, శిలాఫలకంపై ఉన్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధుల చిత్రాలను తొలగించారు. గురువారం నూకతోటి రాజేష్ పార్టీ శ్రేణులతో కలసి ఆ శిలాఫలకాన్ని పరిశీలించారు. శిలాఫలకం ధ్వంసం ఘటనపై ఫిర్యాదు చేసేందుకు ఎంపీడీఓ కార్యాలయ అధికారులు, అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడిన వారిని అరెస్ట్ చేయాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్‌ఐతో మాట్లాడారు. నిందితులపై చర్యలు తీసుకోకపతోఏ జిల్లా కలెక్టర్, ఎస్పీలను కలసి ఫిర్యాదు చేస్తామన్నారు. ఆయన వెంట కేవీబీపురం మండల పార్టీ కన్వీనర్ గవర్ల కృష్ణయ్య, పార్టీ నాయకులు లాల్‌బాబు యాదవ్, ఇతర నాయకులు ఉన్నారు.



ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధ్వంసం చేసిన శిలాఫలకాన్ని పరిశీలిస్తున్న నూకతోటి రాజేష్

కల్తీ పురుగు మందులు, విత్తనాలు విక్రయిస్తే చర్యలు

సత్యవేడు: ఎరువుల డీలర్లు రైతులకు కల్తీ విత్తనాలు, నాసిరకం పురుగు మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏడీఈ సుబ్రమణ్యం హెచ్చరించారు. గురువారం సత్యవేడు వ్యవసాయ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని నాగలాపురం, పిచ్చాటూరు, సత్యవేడు, వరదయ్యపాళెం మండలాల్లోని ఎరువులు, విత్తనాల లైసెన్సు డీలర్లకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, డీలర్లు ఎరువులు, పురుగు మందులు విక్రయించినప్పుడు తప్పనిసరిగా రైతులకు బిల్లులు ఇవ్వాలన్నారు. షాపుల వద్ద ధరల పట్టిక, స్టాకు బోర్డులు ఏర్పాటు చేసి రోజు వారీ స్టాకు, ధర వివరాలు అందులో తెలియజేయాలన్నారు. అనుమతులు లేని పురుగు మందులు, విత్తనాలు అమ్మరాదని హెచ్చరించారు. దుకాణంలో లైసెన్సులు, అనుబంధ పత్రాలు కనిపించే విధంగా ఉంచాలన్నారు. రైతులకు అవసరమైనంత మేరకే మందులు ఇవ్వాలని, అవసరం లేని వాటిని అంటగట్టరాదన్నారు. వేయింగ్ మెషిన్‌కు ప్రతి ఏటా సీల్ వేయించాలని, తూనికలకు ముద్రలు తప్పనిసరిగా ఉండాలన్నారు. తనిఖీల సమయంలో ఇవేవీలేనట్లు గుర్తిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. అలాగే వ్యవసాయ అధికారుల సిఫార్సుల మేరకే రైతులకు పిచికారీ మందులు ఇవ్వాలన్నారు. నెల వారీ రిపోర్టులు ప్రతి నెలా 19వ తేదీన ఏఓకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓలు మురళి (సత్యవేడు), సంజీవరెడ్డి(పిచ్చాటూరు), సుబ్బారావు(నాగలాపురం), వ్యవసాయ సిబ్బంది, డీలర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ

ఉపాధి పనుల పరిశీలన

ఏర్పేడు: మండలంలోని కందాడు పంచాయతీలో చేస్తున్న ఉపాధి హామీ పనులను గురువారం డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ పరిశీలించారు. కూలీల మస్టర్లు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పీడీ మాట్లాడుతూ, ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు ప్రతి పంచాయతీలో నిర్వహించనున్న పల్లె పండుగ వారోత్సవాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులతో ఉపాధి హామీలో నూతనంగా చేపట్టే పనులకు భూమిపూజ చేయించాలన్నారు. పనుల వద్ద సిబ్బంది రెండు పూటలా కూలీల ఫొటోలను ఆన్‌లైన్‌లో పంపాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓలు చంద్రశేఖర్‌రాజు, దేవరి, సాంకేతిక సహాయకుడు పట్టాభిరెడ్డి, కూలీలు పాల్గొన్నారు.

గర్భవతులకు వైద్య పరీక్షలు

బుచ్చినాయుడుకండ్రిగ: గర్భవతులు క్రమం తప్పకుండా వైద్య, రక్తపరీక్షలు చేసుకోవాలని వైద్యాధికారి దివాకర్ కోరారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో గురువారం ప్రధానమంతి సురక్షిత మాతృత్వ అభియాన్ పథకం కింద గర్భవతులకు వైద్య పరీక్షలు చేసి అవగాహన కల్పించారు. రక్త పరీక్షలు చేసుకుంటే రక్తహీనత, ఇతరత్రా ఆరోగ్య సమస్యల గురించి తెలుసుకుని చికిత్స పొందవచ్చన్నారు. దీని వలన గర్భస్థ శిశువు సురక్షితంగా ఉంటుందన్నారు. పీఎంఎంవీవై పథకంలో ప్రభుత్వాసుపత్రిలో మొదటి కాన్పు అయిన గర్భవతులకు రూ. 5 వేలు, రెండవ కాన్పులో ఆడ శిశువు జన్మించినట్లయితే రూ. 5 వేలు, జేఎస్‌వై పథకంలో వెయ్యి రూపాయలను అందజేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథ ప్రచురణకు విరాళం

శ్రీకాళహస్తి: పాత్రికేయుడు, ఎల్ఐసీ ఏజెంట్ పెరిపైడి దొరస్వామి ప్రచురించనున్న శ్రీజ్ఞానామృతం గ్రంథ ప్రచురణకు గురువారం డిగ్రీ కాలేజీ పూర్వ విద్యార్థులు రూ.54వేలు విరాళంగా అందజేశారు. సమస్త పురాణాల సారాంశమైన జీవాత్మ, పరమాత్మ ఒకటే తత్వాన్ని ఈ గ్రంథం తెలియజేస్తుందని దొరస్వామి తెలిపారు. నవంబరు 24న కాంచీపురం కామాక్షమ్మ ఆలయం వద్ద గ్రంథావిష్కరణ చేయనున్నట్టు ఆయన చెప్పారు.

విడిది మండపాల నిర్మాణం పూర్తి చేయించండి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వస్వామి అమ్మవార్లు గిరిప్రదక్షిణ చేసే మార్గంలో అర్ధంతరంగా ఆగిన విడిది మండపాల నిర్మాణం పూర్తి చేయాలని పాలక మండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు కోరారు. గురువారం ఆయన విడిది మండపాలను పరిశీలించి మాట్లాడారు. స్వామి అమ్మవార్లు కైలాసగిరి ప్రదక్షిణ సందర్భంగా 9 చోట్ల విడిది చేస్తారని, అవి పురాతన మండలపాలు కావడంతో బయట షామియానాలు వేసి పూజలు చేసేవారన్నారు. అయితే తమ పాలకమండలి హయాంలో నూతన మండపాలకు తీర్మానం చేసి పనులు ప్రారంభించామని, అయితే ప్రభుత్వం మారడం, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో వాటి నిర్మాణాలు కూడా అర్థంతరంగా ఆగిపోయాయన్నారు. ఎమ్మెల్యే చొరవ చూపి వచ్చే సంక్రాంతి, శివరాత్రి సమయాల్లో జరిగే గిరిప్రదక్షణ లోపు వీటి నిర్మాణం చేయించాలని విజ్ఞప్తి చేశారు.

‘ఉపాధి’ కూలీల సంఖ్య పెంచండి

బుచ్చినాయుడుకండ్రిగ: ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు సిబ్బందిని ఆదేశించారు. మండలంలో చేస్తున్న ఉపాధి హామీ పనులపై గురువారం ఆయన తన కార్యాలయంలో సిబ్బందితో సమీక్షించారు. మండలంలో 2 వేల మంది కూలీలు పనిచేయవలసి ఉండగా 1200 మంది మాత్రమే పనిచేస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. వీరి సంఖ్యను పెంచకపోతే ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కూలీలు నాలుగు గంటల పాటు పనిచేస్తే రూ. 272 కూలీ వస్తుందని, ప్రతి గ్రామ పంచాయతీలో పండ్లతోటల పెంపకం వైపు రైతులు మొగ్గు చూపేలా అవగాహన కల్పించి, నెలాఖరులోపు వారి నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించారు. పనుల వద్ద తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ భానుప్రియ, టెక్నికల్, ఫీల్డ్ అసిసెంట్లు పాల్గొన్నారు.